జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 6-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 609 పేజీలు: 4 వెల : రూ.7



# కొండలు.. కనుమరుగు!

* పలాసలో కంకర మాఫియా బరితెగింపు * రాత్రిళ్లు జేసీబీలతో యథేచ్ఛగా తవ్వకాలు * చట్టాలన్నీ గాలికొదిలి కోట్లలో దందా * అధికార పార్టీ నేతల అండదండలతోనే * చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైన్స్ అధికారులు

**పలాస, మార్చి 5 (వార్త):** పలాస ప్రాంతం కేంద్రంగా కంకర మాఫియా యథేచ్ఛగా కొండలను తవ్వేస్తోంది. కంకర తవ్వకాలతో కొండలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పలాస నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న కోసంగిపురం, తర్లాకోట కొండల వెనుక ప్రాంతాలు, లొద్దభద్ర, మహదేవిపురం, కంబిరిగాం, ఈదురాపల్లి, రాజగోపాలపురం గ్రామాల్లో అక్రమ కంకర తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలు కనిపించని యంత్రాలు... రాత్రి కాగానే రంగంలోకి దిగుతున్నాయి. భారీ జేసీబీలతో కొండలను తవ్వేస్తూ టిప్పర్లలో కంకరను తరలిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం మట్టి, కంకర తవ్వకాలు నిషేధం. రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే వాహనాలు సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానాలు విధిస్తామని ఇటీవల పలాస మండల తహసీల్దార్ హెచ్చరించినా, కంరకర మాఫియాపై మాత్రం ఎలాంటి ప్రభావం కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ, రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్, పర్యావరణ అనుమతులు అన్నీ గాలికొదిలి... ప్రకృతి వనరులను దోచుకుంటూ కోట్ల రూపాయల అక్రమ దందా సాగుతున్నదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ తవ్వకాల వెనుక అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు కూడా స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. పలాస నేషనల్ హైవే నుంచి కోసంగిపురం దిశగా, లలిత చారిటబుల్ ట్రస్ట్ భవనం వెనుక భాగంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తవ్వకాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొండలు నాశనం అవుతున్నా, రహదారులు దెబ్బతింటున్నా, భవిష్యత్‌లో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉన్నా... అధికార యంత్రాంగం మాత్రం మౌనంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నోటి మాటల హెచ్చరికలే తప్ప, చేతల్లో చర్యలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై తక్షణమే కేసులు నమోదు చేయాలని, టిప్పర్లు, జేసీబీలను సీజ్ చేయాలని, సంబంధిత లైసెన్సులు రద్దు చేయాలని పలాస ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రకృతి వనరుల దోపిడీని ఇకనైనా అరికట్టాలని, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళల భద్రతే.. మొదటి ప్రాధాన్యత

* శక్తి యాప్, డయల్ 112 అత్యవసర సేవలు సద్వినియోగం చేసుకోవాలి * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



లోపల పేజీల్లో

## పలాస ఆర్డీవోగా అప్పలరాజు

* బాధ్యతలు స్వీకరణ
* స్వాగతం పలికిన సిబ్బంది



# శభాష్.. శిరీషమ్మ



* రాష్ట్రస్థాయిలో మంచిపని తీరు కనబరిచిన పలాస ఎమ్మెల్యే * శ్రీకాకుళంలో లోక్‌సభ నియోజకవర్గంలో ఆమెది ప్రథమస్థానం * అభినందించిన కూటమి నాయకులు * ఎమ్మెల్యేల పనితీరుపై రైజ్ సర్వే * శిరీషమ్మకు జనం జేజేలు పలుకుతున్నారన్న భావన దుర్యోధన

**మందస, మార్చి 5(వార్త):** ప్రజల సమస్యల పరిష్కారానికి పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష ఎంతో కృషి చేస్తున్నారని, రైజ్ సర్వేలో ఆమె ప్రథమస్థానంలో ఉండడం ఆమె పనితీరుకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు, కళింగ కార్పోరేషన్ రాష్ట్ర డైరక్టర్ భావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని బాలిగాంలో దుర్యోధన విలేకరులతో మాట్లాడారు. రైజ్ రిసెర్చ్ కన్సల్టింగ్ మేనేజ్మెంట్ నివేదిక ప్రకారం శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గంలో గల ఎంఎల్‌ఎల పనితీరు సర్వే రిపోర్ట్ వెల్లడైందన్నారు. ఈ నివేదికలో పలాస నియోజకవర్గం ఎంఎల్‌ఏ గౌతు శిరీషా ప్రథమస్థానం సాధించుకున్నారన్నారు. అదేవిధంగా ఇచ్ఛాపురం ఎంఎల్‌ఏ రెండోస్థానం, ఆమదాలవలస ఎంఎల్‌ఏ కూన రవికుమార్ మూడవ స్థానేం, టెక్కలి ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాల్గవ స్థానం, పాతపట్నం ఎంఎల్‌ఏ మామిడి గోవిందరావు ఐదవస్థానం, శ్రీకాకుళం ఎంఎల్‌ఏ గొండు శంకర్ ఆరవ స్థానం, నరసన్నపేట ఎంఎల్‌ఏ బి.రమణమూర్తి ఏడవస్థానం పొందారన్నారు. అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు పొందిన శిరీషా పరిపాలనలో కూడా దూసుకుపోతున్నారని ప్రశంసించారు. వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారన్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో ఎంఎస్‌ఏ గౌతు శిరీషా పనితీరుకు పట్టం కట్టారన్నారు. జిల్లాలో ఆమె పనితీరు ప్రథమస్థానంలో ఉందంటే, నిరంతరం శిరీషా చేస్తున్న కృషి కారణమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్ద శిరీషమ్మ మంచి మార్కులున్నాయన్నారు. పలాస నియోజకవర్గంలో ఓ మహిళా ఎంఎల్‌ఏగా శిరీషా చేస్తున్న కృషి, పట్టుదల, అంకితభావం చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలిగా.. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ కుమార్తెగా మరింత సంక్షేమాన్ని అందజేస్తారన్నారు. పలాస అభివృద్ధిలో టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి(వీసీ) తనదైన శైలిలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సర్వేలో ప్రథమస్థానం పొందినందుకు ఎంఎల్‌ఏ శిరీషాకు అభినందనలు తెలిపారు.



RISE
Research | Consulting | Management

RISE REPORT

Srikakulam Lok Sabha Constituency
MLA Rankings

| Rank | MLA | Constituency |
| --- | --- | --- |
| 1 | Gouthu Sireesha | Palasa Constituency |
| 2 | Bendalam Ashok | Ichapuram Constituency |
| 3 | Koona Ravi Kumar | Amadalavalasa Constituency |
| 4 | K. Atchennaidu | Tekkali Constituency |
| 5 | M. Govinda Rao | Pathapatnam Constituency |
| 6 | Gondu Sankar | Srikakulam Constituency |
| 7 | B. Ramana Murthy | Narsannapeta Constituency |

శ్రీకాకుళం
Sratakulam
Bay of Bengal

Source: RISE Research – Field Feedback, Public Opinion & Development Indicators

RISE
Research | Consulting | Management



## పలాస ఆర్డీవోగా అప్పలరాజు

**పలాస, మార్చి 5 (వార్త):** పలాస రెవిన్యూ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆర్.అప్పలరాజు గురువారం పలాస ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అప్పలరాజు గతంలో కోటబొమ్మాళి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించారు. కోటబొమ్మాళి తహశీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పలాస ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన పలాస ఆర్డీవో కార్యాలయం సిబ్బంది బొకేలతో స్వాగతం పలికారు.



## క్రైం వార్తలు

### ఒడిశా టు బెంగుళూర్‌కు
# గంజాయి తరలింపు

* 32 కేజీల గంజాయితో ఐదుగురు అరెస్ట్
* వివరాలు వెల్లడించిన సీఐ చిన్నమనాయుడు



**ఇచ్ఛాపురం, మార్చి 5 (వార్త):** ఒడిశా నుండి బెంగుళూర్కు గంజాయిని ఇచ్చాపురం రైలు మార్గం మీదుగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒడిస్సాకు చెందిన ఐదుగురు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేశామని, వారిలో నలుగురు మహిళలు ఉన్నారని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం సర్కిల్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కంధమాల్ జిల్లాకు చెందిన శస్మితాబెహరా, సీతయ్య దల చత్ర, ప్రాతిమా బెహరా, దొళాయి బోయి, నిమంత కన్హర్ వీరంతా ఆర్థిక పరిస్థితి బాగులేనందున అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గంజాయి వ్యాపారం చేసే ఒడిస్సా రాష్ట్రం కందమాల్ జిల్లా పులబాని ఏరియా తిలారంగి గ్రామానికి చెందిన రాధాకాంత్ దిగల్ వద్దకు వెళ్లారు. అతని వద్ద 32 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకొని కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్‌కు తరలించేందుకు సిద్ధమై ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పట్టణ ఎస్సై ముకుందరావుకు వచ్చిన సమాచారం మేరకు ఉదయం 8గంటల సమయంలో రైల్వే స్టేషన్లో తనిఖీలు చేపడుతుండగా అనుమానస్పదంగా కనిపించిన వీరు ఐదుగురు వద్ద తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడిందని తెలిపారు. పట్టుబడిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

## వీడిన మర్డర్ మిస్టరీ

* కేసును ఛేదించిన ఎచ్చెర్ల పోలీసులు
* నిందితుడు అరెస్టు



**శ్రీకాకుళం క్రైం, మార్చి 5(వార్త):** ఎచ్చెర్ల మండలం పరిధిలో పొన్నాడ నుండి వెంకన్న గారి పేట దారిలో ఇటీవల జరిగిన హత్య కేసును ఎచ్చెర్ల పోలీసులు వేగవంతమైన దర్యాప్తుతో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద తెలిపారు. మీడియా సమావేశంలో వివరాలను డీఎస్పీ వెల్లడించారు. శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీకి చెందిన పైలా మోహన్ రావు (40) గత నెల 26వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల నుండి 4 గంటల మధ్య ఎచ్చెర్ల మండలం రాజావారి టేక్ తోట ప్రాంతంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై మృతుడి భార్య పైలా శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, శాస్త్రీయ ఆధారాలు సేకరించి, స్థానికుల నుండి సమాచారం పొందారు. దర్యాప్తులో భాగంగా శ్రీకాకుళం పట్టణంలోని హయాతి నగరానికి చెందిన ఆలబోయిన దిల్లేశ్వరరావు (21) ఈ హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో మోహన్ రావుపై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి, అతనిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ అనంతరం గురువారం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో జేఆర్‌పురం సర్కిల్ ఇన్స్పెక్టర్ అవతారం, ఎచ్చెర్ల ఎస్సై జి. లక్ష్మణరావు, జి.సిగడాం ఎస్సై బి.సందీప్ కుమార్ , పోలీసు సిబ్బంది తదితరులు కీలక పాత్ర పోషించినట్లు డీఎస్పీ తెలిపారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**నరసన్నపేట, మార్చి 5(వార్త):** పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై బలివాడ గణేష్ తెలిపారు. గురువారం ఉదయం అందిన సమాచారం మేరకు నరసన్నపేట మండలం గొట్టిపల్లి పంచాయితీ రెడ్డికి పేట కాలువ గట్టుపై ఐదుగురు పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.5,880 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఐదుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అధిక లోడుతో ట్రాక్టర్ల రవాణా



**నరసన్నపేట, మార్చి 5(వార్త):** నిబంధనలకు వ్యతిరేకంగా పట్టపగలే ట్రాక్టర్లపై అధిక లోడుతో రవాణా జరగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం నరసన్నపేట ప్రధాన హైవే సత్యవరం జంక్షన్ వద్ద అధిక లోడుతో వస్తున్న ఒక ఊక ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా ఆగిపోవడంతో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాక్టర్ మధ్య రోడ్డులో నిలిచిపోవడంతో వాహనాలు నిలిచిపోయి పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొంతసేపు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టపగలే ఇలాంటి ప్రమాదకర రవాణా కొనసాగితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిబంధనలు కఠినంగా అమలు చేసి అధిక లోడుతో రవాణాను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళల భద్రతే.. మొదటి ప్రాధాన్యత




* శక్తి యాప్, డయల్ 112 అత్యవసర సేవలు సద్వినియోగం చేసుకోవాలి
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం క్రైం, మార్చి 5 (వార్త):** అత్యవసర సమయంలో జిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న శక్తి యాప్, డయల్ 112 సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కోరారు. మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా గురువారం శ్రీకాకుళం పట్టణంలో కాకినాడ ఆదిత్య కళాశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మహిళల భద్రత, సాధికారతపై ఫ్లాష్ మాబ్, సందేశాత్మక లఘు చిత్రాల ప్రదర్శన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కడం ద్వారా లేదా 112కు కాల్ చేయడం ద్వారా సమీపంలోని పోలీసు సిబ్బంది తక్షణమే స్పందిస్తారని తెలిపారు. నారి శక్తి అవగాహన కార్యక్రమంలో జిల్లా పోలీస్ యంత్రాంగం మొదటి ప్రాధాన్యత ఇస్తారన్నారు. శక్తి యాప్ ద్వారా మహిళల భద్రత మరింత బలోపేతం అవుతుందని, అత్యవసర ప్రమాద పరిస్థితుల్లో వేగవంతమైన సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. యువతులు తమ భవిష్యత్తును తమ అభిరుచులకు అనుగుణంగా స్వయంగా ఎంచుకొని, లక్ష్యసాధన దిశగా దృఢసంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. చదువు, ఉద్యోగం, వివాహం వంటి అంశాల్లో ఆలోచనాత్మక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మగవాడి జీవితంలో ఏదో ఒక దశలో మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తారని, కుటుంబం నుండి సమాజం వరకు మగవారి అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత ప్రముఖమని ఎస్పీ పేర్కొన్నారు. మహిళల గౌరవం, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నంబర్ల ప్రాధాన్యతను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల కోసం ప్రత్యేక సహాయ నంబర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ వంటి సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నంబర్‌ను ఏ సందర్భంలో ఉపయోగించాలో విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, పోలీసులు ఎల్లప్పుడూ సహాయానికి సిద్ధంగా ఉంటారని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను గౌరవంగా స్వీకరించి జీవితంలో సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో మహిళల సాధికారత, భద్రత లక్ష్యంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. ఫ్లాష్ మాబ్, లఘు చిత్రాల ద్వారా మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, ఆత్మవిశ్వాసం పై విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ వివేకానంద, ఇన్స్పెక్టర్లు పైడిపు నాయుడు, నారీ మణి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, మహిళా పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నరసన్నపేటలో మెగా జాబ్ మేళా

**నరసన్నపేట, మార్చి 5(వార్త):** నరసన్నపేట పట్టణంలోని ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. 11 పరిశ్రమలకు సంబంధించిన ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ఈ మేళాను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయంలో నిరుద్యోగులకు ప్రైవేటు రంగాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు అందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా మంచి అవకాశాలు లభించేలా ఇటువంటి జాబ్ మేళాలను తరచుగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను నమ్ముకుని ధైర్యంగా ముందుకు సాగి, లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం, వివిధ సంస్థలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, సారవకోట మండల పార్టీ అధ్యక్షులు, వివిధ కమిటీ ఛైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జులు, మహిళా మరియు యువత విభాగాల నాయకులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




### 99 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు

నరసన్నపేట పట్టణంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 99 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. సుమారు 257 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 15 కంపెనీలు పాల్గొనగా, అందులో 99 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. జాబ్ మేళాను నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయికుమార్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.







## 8న 'అస్మిత' క్రీడా పోటీలు

**శ్రీకాకుళం, మార్చి 5(వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో 'అస్మిత' అథ్లెటిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ (మేరా యువ భారత్), జిల్లా యంత్రాంగం, జిల్లా క్రీడా సాధికారిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి.

### పోటీల వివరాలు..

మార్చి 8న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ క్రీడల్లో మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయి. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంతో పాటు టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట), ఫన్ గేమ్స్ నిర్వహించనున్నారు. 13 ఏళ్ల లోపు వారు, 13-18 ఏళ్ల లోపు వారు, 18 ఏళ్లు పైబడిన యువతులు/మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.

### రిజిస్ట్రేషన్ ఇలా..

ఆసక్తి గల క్రీడాకారిణులు nsrs.kheloindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పాల్గొన్న వారందరికీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఆన్‌లైన్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేస్తారు. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు మెడల్స్ ప్రధానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని అర్హులైన బాలికలు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉన్నతితోనే గిరిజన మహిళలకు
# ట్రైకార్ సబ్సిడీ రుణాలు

**మందస, మార్చి 5(వార్త):** గిరిజన ప్రాంతంలో గల ఔత్సాహిక స్వయం సహాయక మహిళలను ఎంటర్ప్రెనర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారానే ట్రైకార్ సబ్సిడీ రుణాలను కూడా అందిస్తున్నట్లు మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ పంచ సూత్రాలు పాటిస్తూ, గతంలో ఇచ్చిన ఏ విధమైన బ్యాంకు, గ్రామ సంఘం, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలలో మొండి బకాయిలు కానీ ఏ గ్రేడ్ స్వయం సహాయక సంఘాలలో 20 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల షెడ్యూలు తెగలకు చెందిన మహిళలకు జీవనోపాధి యూనిట్లను స్థాపించుకోవడానికి ముందుకు వచ్చిన మహిళలకు వడ్డీ లేని ఉన్నతి లోన్లతో పాటు ఒక్కో వ్యక్తికి 50 వేల రూపాయల బ్యాక్ ఎండ్ సబ్సిడీతో కూడిన ట్రైకార్ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. లబ్ధిదారులు తీసుకున్న రుణం ద్వారా వారు ఎంపిక చేసుకున్న జీవనోపాధికి సంబంధించిన యూనిట్ ఖచ్చితంగా నిర్వహణలో ఉండాలని తెలిపారు. లబ్ధిదారులు ఒక లక్ష రూపాయల యూనిట్‌కు 50వేల రూపాయలు బ్యాక్ అండ్ సబ్సిడీతో పాటు 40,000 ఉన్నతి రుణము, 10,320 బెనిఫిషియరీ కాంట్రిబ్యూషన్ లబ్ధిదారుని గ్రామ సంఘం ఖాతాకు చెల్లించవలసి ఉంటుందన్నారు. అర్హత గల ఔత్సాహిక మహిళలంతా మీ గ్రామ సంఘం ద్వారా మండల మహిళా సమాఖ్యకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అర్హత గల మహిళలందరికీ ప్రభుత్వం ఎంటర్ప్రెనేర్లగా ప్రోత్సహిస్తూ, అవసరమైన రుణాలను మంజూరు చేయబోతున్నట్లు వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు చెప్పారు.





## ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

**నరసన్నపేట, మార్చి 5(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు, ప్రభుత్వ కళాశాలల్లోనే చేరేందుకు ఆసక్తి చూపాలని నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రాంప్రసాద్, ఈశ్వరరావు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సౌకర్యాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఉచిత విద్యతో పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్సులు, ప్రాక్టికల్ రికార్డులతో పాటు మధ్యాహ్న భోజన పథకం కూడా అమల్లోకి వచ్చిందనీ వివరించారు. అర్హత అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధన ద్వారా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మడపాం, సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రత్యేక అవగాహన కల్పించారు. రానున్న పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు పొందేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. డీవీఈఓ ఆర్.సురేష్ కుమార్ ఆదేశాలతో ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల సూచన మేరకు పదోతరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి క్యాంపైనింగ్ నిర్వహిస్తున్నట్లు అధ్యాపకులు రాంప్రసాద్, ఈశ్వరరావు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కార్గిల్ విక్టరీ పార్క్ పనులు పూర్తి చేయండి

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం,మార్చి5(వార్త):** కార్గిల్ విక్టరీ పార్క్ పనులు చిన్న చిన్న మార్పులు చేసి సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. కార్గిల్ విక్టరీ పార్క్ లో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పార్క్ లో నిర్మితమవుతున్న రెండు బ్యాట్మింటన్ కోర్టులు, పికెల్ బాల్ కోర్ట్, బాక్స్ క్రికెట్ కోర్టులు ఇప్పటికే దాదాపుగా పూర్తి అయినప్పటికీ చిన్న చిన్న మార్పులను సూచించారు. యోగా ప్లాట్ ఫారం (ఓపెన్ ఎయిర్ థియేటర్)ముందు భాగంలో స్క్రీన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన టాయిలెట్ కంటైనర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ వాకింగ్ ట్రాక్ ప్రక్కలో ఏర్పాటు చేయాల్సిన మొక్కలు, తదితర మార్పులపై కలెక్టర్‌కు వివరించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు వెనుక భాగంలో కార్గిల్ యుద్ధం ప్రారంభం నుండి విజయం సాధించిన వరకు వివరించే చిత్రాలు ఆకట్టుకున్నట్లు చెప్పారు. పార్క్ లో చేసిన ప్రతీ ఒక్క పనిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పార్క్ పనులు సత్వరమే పూర్తి చేసి అందించాలని ఆదేశించారు. సుడా ఈఈ సుగుణాకరరావు, సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ, హౌసింగ్ బోర్డు కాలనీ అసోషియేషన్ సభ్యులు రామకృష్ణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు

*** డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు**




**పలాస, మార్చి 5 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 2వ వార్డు పరిధిలో, సర్వే నెంబర్ 28లో ఉన్న సుమారు రూ. 5 కోట్ల మార్కెట్ విలువైన 1.84 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారని 29వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి జోగ మల్లేశ్వరరావు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, ఆయన పట్టణ ముఖ్య నాయకులతో కలిసి స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని కొందరు స్వార్థపరులు దోచుకుంటున్నారన్నారు. దీని వెనుక ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నప్పటికీ, వారిని వదిలిపెట్టకూడదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కోరారు. టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు మాట్లాడుతూ "ఇది కేవలం ఆక్రమణ కాదు, ప్రజల ఆస్తిపై జరిగిన ఒక వ్యవస్థీకృత దాడి అని అన్నారు. ప్రజాధనాన్ని కొందరు స్వార్థపరులు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. విచారణ పూర్తయ్యేంత వరకు, వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించకుండా దాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ ముఖ్య నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల్లో

# శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

*** హాస్టలనేది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదిక * విద్యార్థులతో వార్డెన్లు కుటుంబ సభ్యుల్లా మెలగాలి * పిల్లలు స్వీయ రక్షణ చేసుకునేలా శిక్షణ ఇవ్వాలి * పార్వతీపురం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**




**పార్వతీపురం, మార్చి 5(వార్త):** విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వసతి సంక్షేమ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక, బిసి, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల వార్డెన్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అందుకు సంబంధించి ఎఎస్.డబ్ల్యుఓ,ఎటిడబ్ల్యుఓ,ఎబిసిడబ్ల్యుఓలు వాట్సాప్ గ్రూపుని క్రియేట్ చేసి, ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. సొసైటీ కన్వీనర్ తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి, వారి విద్యాప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముస్తాబు కార్యక్రమానికి సంబంధించి ప్రతీ స్కూల్, వసతి గృహాల్లో రోజు వారీ పురోగతిని వీడియోలు, రీల్స్ తీయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతీ వసతి గృహంలోనూ క్రమం తప్పకుండా యోగ, స్కిప్పింగ్, చదరంగం, ఆటలు, పాటల కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాల పర్యవేక్షకులు అధికారుల్లా కాకుండా పిల్లలతో కుటుంబ సభ్యుల్లా మెలిగి పిల్లల్లో ఉండే భయాన్ని పోగొట్టాలని కలెక్టర్ హితవు పలికారు. పిల్లలతో పాటు వార్డెన్లు కూడా ఆట పాటల్లో పాల్గొని వారిని ఉత్తేజ పరచాలని సూచించారు. చిన మేరంగి వసతి గృహ మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని బిసి సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న వసతి, భోజనంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో సౌకర్యవంతంగా ఉండేలా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆహారం నాణ్యతను రోజువారీగా పరీక్షించాలని, నీటి వనరులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలను క్రమం తప్పకుండా తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉత్తేజభరిత కార్యక్రమాలు, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. హాస్టల్ అనేది కేవలం వసతి గృహం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే వేదికని కలెక్టర్ అన్నారు. ప్రతీ విద్యార్థిని ఒక సైనికుడిలా తయారు చేయాలని, ఆపద వస్తే తమను తాము స్వీయ రక్షణ చేసుకునేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ వార్డెన్లకు సూచించారు. అన్ని హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లతో పాటు దోమల నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందని, జిల్లాలోని 11 హాస్టళ్లకు సాధారణ మరమ్మతుల కోసం బీసీ సంక్షేమ శాఖ నుండి రూ. 20.80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వసతి గృహాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థులు తరవుగా చదవడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపొందుతుందని, పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. వసతి గృహం ప్రవేశ మార్గం నుండి విద్యార్థుల గదులు, వంటశాల, భోజనశాల, సిబ్బంది, వంట చేసే విధానం, భోదనా సిబ్బంది, అల్పాహారంకు సంబంధించిన వీడియోలను చిత్రీకరించి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టరు హయాంలో సంక్షేమ వసతి గృహాల్లో తీసుకువచ్చిన సంస్కరణలు, మార్పులను గుర్తుచేసుకుంటూ వసతి సంక్షేమ అధికారులు, వార్డెన్లు దుస్సాలువతో జిల్లా కలెక్టరును ఘనంగా సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఎ.విజయశాంతి, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంటు జ్యోతి, వసతి గృహాల వార్డెన్లు సాంబయ్య, అనురాధ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నానీ'గా మారి...

# విదేశాల్లో స్థిరపడండి!

**X విజయనగరం జిల్లా మేనేజరు బి.రెబెక్కా సామ్యుల్**

విజయనగరం, మార్చి 5(వార్త): పిల్లల సంరక్షణలో శిక్షణ పొంది, విదేశాల్లోనూ, మెట్రో నగరాల్లోనూ గౌరవప్రదమైన ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునే మహిళలకు విజయనగరం మహిళా ప్రాంగణం ఒక చక్కని అవకాశాన్ని కల్పిస్తోందని ఎన్.టి.ఆర్. నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) జిల్లా మేనేజరు బి.రెబెక్కా సామ్యుల్ తెలిపారు. . 'నానీ కేర్ సర్వీసెస్' సర్టిఫికేట్ కోర్సు ద్వారా నిపుణులైన చైల్డ్ కేర్ ప్రొఫెషనల్స్‌గా మారేందుకు మహిళా ప్రాంగణం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సాధారణంగా కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో పాటు మన దేశంలోని ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో శిక్షణ పొందిన నానీలకు (పిల్లల సంరక్షకులు) భారీ డిమాండ్ ఉంది. కేవలం పిల్లల సంరక్షణే కాకుండా వారి మానసిక వికాసం, భద్రత మరియు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించడంలో ఈ 6 నెలల కోర్సు మీకు పూర్తి అవగాహన కల్పిస్తుంది. 10వ తరగతి ఉత్తీర్ణత. వయోపరిమితి: 25 నుండి 50 ఏళ్ల మధ్య గల మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలం 6 నెలలు ఉంటుంది. ఫీజు కేవలం రూ. 10,000/- మాత్రమే. విదేశాల్లోని సంపన్న కుటుంబాలు, మెట్రో నగరాల్లోని ప్రీ-స్కూల్స్ మరియు డే-కేర్ సెంటర్లలో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఆసక్తి గల మహిళలు తమ ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం మరియు 3 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేరుగా విజయనగరం బి.సి. కాలనీలోని మహిళా ప్రాంగణం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడతాయి. మరిన్ని వివరాలకు 08922-255619, 8333921338 సంప్రదించాలని జిల్లా మేనేజరు బి.రెబెక్కా సామ్యుల్ తెలిపారు.

## పార్వతీపురం జిల్లాలో

# 180 కొనుగోలు కేంద్రాలు

*** ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం**

*** సివిల్ సప్లయస్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాసు**

**పార్వతీపురం, మార్చి 5(వార్త):** పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగినదని సివిల్ సప్లయస్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ డివిజన్ కు సంబంధించి అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతుల నుండి 61735.48 టన్నుల ధాన్యం సేకరించి 61604.48 టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు సంబంధించి రైతులు తమ ధాన్యం నూర్పులు చేసి కల్లాల దగ్గర సిద్ధం చేసి ఉన్నా, రైతు సేవా కేంద్రాలలో టార్గెట్ లేనందున ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. దానికి సంబంధించి జిల్లాలో మిగిలిన టార్గెట్ ని సర్దుబాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మిగిలిన లక్ష్యాన్ని మొదలు పెడతామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది పడకుండా అదనంగా 10వేల టన్నుల టార్గెట్ ఇవ్వమని సివిల్ సప్లై వారిని కోరడం జరిగిందని, ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ నుండి టార్గెట్ వచ్చిన వెంటనే రైతు సేవా కేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశిస్తామని పేర్కొన్నారు. రైతులు వద్ద నుండి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకొనుటకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# అన్నదానానికి లక్ష వితరణ

**అరసవల్లి, మార్చి 5 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో అన్నదాన పథకం నిమిత్తం శ్రీకాకుళం వాస్తవ్యులు అందవరపు వెంకట సాయి ఆశిష్ కుటుంబీకులు లక్ష రూపాయల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌కు గురువారం అందజేశారు. అంతకుముందు వారు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.





## నరసన్నపేట పీఎస్‌కు

# పదో తరగతి ప్రశ్నాపత్రాలు చేరిక

**నరసన్నపేట, మార్చి 5(వార్త):** నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు పదో తరగతి ప్రశ్నాపత్రాలు చేరుకున్నాయని ఎంఈఓ-2 దాలి నాయుడు తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌కు నిమ్మాడ, ఈదులవలస, తిలారు పరీక్షా కేంద్రాలకే కాకుండా నరసన్నపేటలోని ఆరు పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సెట్-1 ప్రశ్నాపత్రాలు చేరాయని వివరించారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. పరీక్షలు సజావుగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

# పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల పంపిణీ పూర్తి



**జలుమూరు, మార్చి 5(వార్త):** ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేసిందని ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, మడ్డు వెంకటరమణ, భూలక్ష్మి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన సెట్--1 ప్రశ్నాపత్రాలు సారవకోట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయని వెల్లడించారు. ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయుల సమక్షంలో భద్రపరిచే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

## మహిళలపై దాడికి వ్యతిరేకంగా

# పోరాడుదాం

*** పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరమ్మ, కుసుమ**



**పలాస, మార్చి 5 (వార్త):** శ్రామిక మహిళల ఉపాధిపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడుదామని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరమ్మ, పి.కుసుమ పిలుపునిచ్చారు. పీవోడబ్లూ రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా మార్చి1 నుండి 8 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో నిరసన ప్రదర్శనలు, సభలు, సదస్సులు, ర్యాలీలను నిర్వహిస్తున్నారు. పలాస మండలం మామిడిపల్లిలో పీవోడబ్లూ ముద్రించిన కరపత్రాలను గురువారం స్థానిక మహిళలతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈనెల 8న మామిడిపల్లి గ్రామంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా జరగనున్న సభను జయప్రదం చేయాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నీరుగారుస్తూ ఉపాధిని ఒక హక్కుగా కాకుండా ఒక సంక్షేమ పథకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని మార్చి జివి జి రాంజీ పేరుతో, రాష్ట్రాలు 40 శాతం వాటా నిధులు కేటాయిస్తేనే పథకాన్ని అమలు జరిగేటట్టు మార్చడం, నిరుపేద గ్రామీణ శ్రామిక మహిళల పొట్ట కొట్టడమేనని వారు విమ ర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు బతకల ఈశ్వరమ్మ, పోతనపల్లి కుసుమలతో పాటు సార గంగమ్మ, కర్రి భారతమ్మ, సార గీత, వంకల సుగుణ, వంకల వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువ ఇంజనీర్ మృతి



**నరసన్నపేట, మార్చి 5(వార్త):** నరసన్నపేట మండలం కరగాం గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ తోట రాము సాయి (22) గుండెపోటుతో మృతి చెందాడు. జీవనోపాధి కోసం హైదరాబాద్లోని ఒక ప్రైవేటు కన్స్ట్రక్షన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న రాము సాయి మంగళవారం అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతదేహాన్ని బుధవారం సాయంత్రం కరగాం గ్రామానికి తీసుకువచ్చారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు.

# పెన్షన్ ఇప్పించండి



**పోలాకి, మార్చి 5(వార్త):** పోలాకి మండలానికి చెందిన విశ్రాంత గ్రంథాలయ అధికారి కె.బి. సుబ్రహ్మణ్యం గత మూడు నెలలుగా ప్రభుత్వం తమకు పెన్షన్ చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మండల, జిల్లా అధికారులతో పాటు రాజకీయ నాయకులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ లేక జీవనాధారం కష్టమవుతోందని పేర్కొన్నారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్ విడుదల చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## తపోవన వృద్ధాశ్రమాన్ని సందర్శన

**నరసన్నపేట, మార్చి 5(వార్త):** జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం తపోవన వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. నరసన్నపేట మండలం గొట్టిపల్లి గ్రామ శివారులో ఉన్న ఓల్డ్ ఏజ్ హోంకు వెళ్లిన ఆయన వృద్ధులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు గుడ్ల నాగరాజును అభినందించారు. కొందరు వృద్ధులకు పెన్షన్ అందడం లేదని ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని హరిబాబు హామీ ఇచ్చారు.

## ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 702 మంది హాజరు

**శ్రీకాకుళం, మార్చి 5(వార్త):** జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు (తెలుగు, హిందీ) ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి పి. రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 06 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మాస్ కాపీయింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా 02 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 06 సిట్టింగ్ స్క్వాడ్లతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిందని ఆయన వివరించారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 929 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 702 మంది పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు. మిగిలిన 227 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలియజేశారు.



## శాసనమండలి చైర్మన్‌పై
# మంత్రి వ్యాఖ్యలు సరికాదు
### మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్


**నరసన్నపేట, మార్చి 5(వార్త):** శాసనమండలి చైర్మన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు సరికాదని మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. గురువారం నరసన్నపేట వైసీపీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సభను హుందాగా నడపాల్సిన ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. సభా మర్యాదకు భంగం వాటిల్లే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సభా నియమ నిబంధనలు, పరస్పర గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

## హోంగార్డుకు సన్మానం



**శ్రీకాకుళం, మార్చి5(వార్త):** శ్రీకాకుళం జిల్లా హోంగార్డు యూనిట్ విభాగానికి చెంది రాజాం పోలీస్ స్టేషన్లో హోంగార్డు గా సేవలందించి పదవీ విరమణ పొందిన పి శంకర్ రావు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సన్మానించి జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని, తక్షణ ఆర్థిక సహాయంగా 5 వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు సేవలను ప్రశంసిస్తూ హోంగార్డుగా క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ ప్రశంసనీయం. విధి నిర్వహణలో పోలీసు శాఖకు అందించిన సేవలను అంకితభావంతో అందించారు," అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్ శేషాద్రి,కార్యాలయ పరిపాలన అధికారి సి హెచ్ గోపినాథ్, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇమాన్యూవల్ రాజు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ కెవి రమణ, కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శక్తి టీమ్ ఆధ్వర్యంలో పోటీలు




**ఇచ్ఛాపురం,మార్చి 5 (వార్త):** శాంతినికేతన్ హైస్కూల్‌లో శక్తి టీమ్-5 కాశీబుగ్గ పోలీస్ ఆదేశాలు మేరకు స్కూల్ విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, ఆన్ లైన్ మోసాలు, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా పోలీస్శక్తి టీమ్-5 ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహించడం జరిగిందని ఈ పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలియజేశారు. పోటీల్లో విజేతలైన మాధవి, తనుజ, ఇఖిత, నైమాత్ హుస్సేన్ లకు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే. సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, రాజ్యలక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.


## యువత అన్ని రంగాల్లో ముందుండాలి




**ఇచ్ఛాపురం, మార్చి 5 (వార్త):** వికసిత్ భారత్ యువజన పార్లమెంట్‌లో యువ నాయకుడు హంగీర్ బెహరా సందేశాన్ని అందించారు. అంబెడ్కర్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో పలువురు యువత దేశభక్తి భావంతో ముందుకు వచ్చి, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని సంకల్పం వ్యక్తం చేశారు. హంగీర్ బెహరా మాట్లాడుతూ, "యువత మారాలి – దేశం మారుతుంది. భారత ప్రభుత్వం యువతకు మంచి విద్య, ఉపాధి అవకాశాలు మరియు నాయకత్వ అవకాశాలు కల్పించాలి. చదువుకున్న ప్రతి యువకుడు దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**నరసన్నపేట, మార్చి 5(వార్త):** జిల్లా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నరసన్నపేటలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఇన్స్పెక్టర్ కమలహాసన్, పోస్టుమాస్టర్ రామారావు తెలిపారు. గురువారం నరసన్నపేట పోస్ట్ ఆఫీసులో వారు మాట్లాడుతూ, స్థానిక కేంద్రంలో ఆధార్ నమోదు, అప్డేట్ సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. అయితే ఈ సేవల గురించి సరైన సమాచారం లేకపోవడంతో వినియోగదారులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఆధార్ సేవలను సులభంగా అందించేందుకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఆధార్ వివరాలను నవీకరించుకోవాలని సూచించారు.



## ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు అండగా
# కూటమి ప్రభుత్వం

* ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే
* పంటల బీమాలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం
* అరకు కాఫీ తోటల్లో 'కాఫీ బెర్రీ బోరర్' వ్యాధిపై తక్షణ చర్యలు
* రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు
* మండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, మార్చి 5(వార్త):** ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం,అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి శాసన మండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

### పంటల బీమా వ్యవస్థపై వివరణ

పంటల బీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత బీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు బీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ.2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మళ్లీ పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.



### అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణ చర్యలు

అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## డయేరియా తగ్గే వరకూ
# పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

* జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ * మండల వీధి, గుజరాతీపేటలో పారిశుధ్య పనుల తనిఖీ





**శ్రీకాకుళం, మార్చి 5(వార్త):** నగరంలో డయేరియా ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు పారిశుధ్య పనుల్లో ఎక్కడా అలసత్వం వహించకూడదని జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్ఛార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన శ్రీకాకుళం నగరంలోని మండల వీధి, గుజరాతీపేట సహా పలు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో మురుగు కాలువల పూడికతీత పనులను స్వయంగా పరిశీలించి, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా నిరంతరం క్లియర్ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం 5 ట్రాక్టర్లు, 3 జేసీబీలను రంగంలోకి దించి, 21 ట్రిప్పుల ద్వారా మొత్తం 34 టన్నుల పూడిక, 6 టన్నుల చెత్తను కలిపి మొత్తం 40 టన్నుల వ్యర్థాలను నగర వెలుపలికి తరలించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా సుమారు 1.3 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడికను పూర్తిస్థాయిలో తొలగించారు. పర్యటనలో భాగంగా ఇన్ఛార్జి కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ నిర్దేశిత సమయానికి విధులకు హాజరై వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా డయేరియా ప్రభావిత వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, క్లోరినేషన్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కోరారు. ప్రజారోగ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఘనంగా అయ్యప్పస్వామి తిరు నక్షత్ర సేవ

**ఇచ్ఛాపురం, మార్చి 5 (వార్త):** అయ్యప్ప స్వామి పంచాయతన దేవాలయంలో స్వామి జన్మదినోత్సవం భక్తుల సమక్షంలో కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# టీడీపీ నేత 'ఔగాన ఈశ్వరరావు' ఉదారత


* బాలాజీపురంలో వీధిదీపాలు ఏర్పాటు
* ఈశ్వరరావును అభినందించిన గ్రామస్థులు

**మందస, మార్చి 5(వార్త):** సమస్యలపై స్పందించే ఔగాన ఈశ్వరరావు మరోసారి తన ఉదారతను చూపారు. వీధిలైట్లు వెలగకపోవడంతో స్వయంగా లైట్లను కొనుగోలు చేసి, వెలుగులు పంచారు. మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మందస మండల యువత అధ్యక్షుడు, సామాజిక, ఆధ్యాత్మికవేత్త ఔగాన ఈశ్వరరావు సామాజిక, సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఔదార్యం చూపుతుంటారు. సొండిపూడి పంచాయతీలోని బాలాజీపురం గ్రామంలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే ఈశ్వరరావు సొంత నిధులను వ్యయం చేసి, వీధిలైట్లు తెప్పించారు. అంతేకాకుండా విద్యుత్ లైన్ మేన్ ను పిలిపించి, వాటిని ఇన్‌స్టాల్ కూడా చేయించారు. వీధి దీపాలు వెలగడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టి.కాంతారావు, టి.సంతోష్, పి.చిరంజీవి, టి.వంశీ తదితరులు పాల్గొన్నారు. ఈశ్వరరావు మరిన్ని మంచి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వీధి లైట్లు వేసిన ఈశ్వరరావుకు వారంతా కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలను చేస్తుంటానన్నారు. ప్రజలు తన పట్ల చూపుతున్న ఆదరా భిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. పలస నియోజకవర్గం ఎంఎల్ఎ గౌతు శిరీషా ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, ఆమె ఆదేశాల మేరకు మరిన్ని సామాజిక, సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేస్తామన్నారు.



## పల్లెల్లో రోడ్ల పండగ

* చురుగ్గా రహదారులు, కాలువల నిర్మాణాలు * ఐదేళ్ల తర్వాత బాగుపడుతున్న మౌలిక వసతులు
* ప్రజల్లో హర్షాతిరేకాలు



**జి.సిగడాం, మార్చి5(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని మండల టిడిపి అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్ అన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అదేశాల మేరకు గురువారం దాలెం రాజువలస గ్రామంలో పల్లె పండగ 2.0సీసీ రోడ్ల పనులలో భాగంగా రూ. 25 లక్షలకు సెంటల్లో 4 లక్షల నుండి 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కుమరాపు రవి కుమార్, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పల్లె పండగ' పేరిట గ్రామాల్లో గత నెల 14 నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రస్తుతం అన్నిచోట్లా రహదారులు, కాలువల పనులు జరుగుతుండడంతో.. గ్రామాలకు మహర్దశ వచ్చిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమరాపు శ్రీనివాసరావు, పాండ్రంకి సీతారాం, డీఈ శ్రీరాములు,పీఆర్ఏఈ లతాశ్రీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10న మండల స్థాయి టాలెంట్ టెస్ట్

**సారవకోట, మార్చి 5(వార్త):** సారవకోట మండలం పెద్దలంబ ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం బి. లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కొండాల చంద్రభూషణరావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ టాలెంట్ టెస్ట్ జరుగుతుందని వివరించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు తప్పక హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం పిలుపునిచ్చారు.

## టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రశంసా పత్రాలు

**జలుమూరు, మార్చి 5 (వార్త):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జలుమూరు మండలం శ్రీముఖలింగం జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న విద్యార్థులు హాసిని, గణేష్ ఉపాధ్యాయ సిక్కోలు సంస్థ నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో విజయం సాధించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్ఛార్జి హెచ్ఎం దాసు విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546